క్లుప్తంగా

ఓటరు జాబితా సిద్ధం చేయండి



గట్టు: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సిద్ధం చేయాలని కార్యదర్శులను ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీడీఓ రవి ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు పలు వార్డుల్లో ఉన్న వారిని గుర్తించి, కుటుంబ యజమాని ఉండే చోటే అందరి ఓట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర పంచాయతీల ఓటర్లు కలవకుండా ఏ పంచాయతీకి అదే పంచాయతీలో ఓటర్లు ఉండేలా గుర్తించాలన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



మల్దకల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలలో బడిబయట ఉన్న వారిని గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు పాఠశాలలకు సక్రమంగా పంపించేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పొలం పనులకు తీసుకెళ్లడం వలన వారి చదువుకు ఆటంకం కలుగుతుందని, విద్యార్థులను పనులకు తీసుకెళ్లరాదని సూచించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేష్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఓ 60 ప్రకారం జీతాలు చెల్లించాలి

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 60 జీఓ ప్రకారం జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రమకు తగ్గ వేతనం ఏజెన్సీ నిర్వాహకులు ఇవ్వడం లేదన్నారు. 220 బెడ్లకు గాను 100 మంది కార్మికులతో పని చేయాల్సిన క్రమంలో 50 మందితో పనులు చేయించడం సబబు కాదన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు నిబంధనల మేరకు జీతాలు అందజేయాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, పరశ, చామంతి తదితరులు ఉన్నారు.

తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో కారుని నిర్లక్ష్యంగా నడిపి హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పాత బస్టాండ్ కూడలిలో మంగళవారం ఉదయం 10 గంటలకు కారు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాల వైపు దూసుకెళ్లింది. అయితే అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ కారును వదిలి పారిపోయాడు. ఈ ఘటనపై స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ సిబ్బంది కారు యాజమాని, డ్రైవర్ ఎవరనే అంశాంపై విచారణ చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మానవపాడు: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. మంగళవారం మండలంలోని గోకులపాడులో అవగాహన కల్పించారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే కేవైసీలను అప్‌డేట్ చేయాలని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వీకేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా ఒక మొక్కను నాటాలని అన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు రవికిరణ్, గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రామలింగం, కృష్ణానాయక్, శ్రవన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

శునకాలతో జనం బెంబేలు

- గ్రామాల్లో స్వైరవిహారం
- ప్రాగటూరులో ఒకే రోజు ముగ్గురు చిన్నారులపై దాడి
- చికిత్సకు కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి

ఉండవెల్లి: గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలను బెంబేలెత్తున్నారు. వృద్ధులు, చిన్నారులపై కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. మండలంలో రాత్రిపూట బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఇటీవల వీధికుక్కల దాడులు ఎక్కువ కావడంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీంతో నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేసింది. అయితే కుక్కలను చంపొద్దని చట్టం ఉండడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు కుక్కలను నియంత్రించాలని కోరుతుండడంతో యానిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. కాని కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పనికావడంతో జిల్లా కేంద్రంలో యానిమల్ కేర్ సెంటర్ నామమాత్రంగానే ఉంది.

కాటు వేస్తే కర్నూలుకే..

మండలంలోని 16 గ్రామాల్లో రెండు మండలాలకు విడిపోవడంతో కుక్క కాటు వేస్తే మానవపాడు పీహెచ్‌సీకా, అలంపూర్ పీహెచ్‌సీకా, క్యాతూర్ పీహెచ్‌సీకి వెళ్లాలా అని ప్రజలు ఆలోచనలో పడి కర్నూల్ ఆస్పత్రి వైపు పరుగులు పెడుతున్నారు.



మండల కేంద్రంలో సంచరిస్తున్న కుక్కలు

మండలంలోని ప్రాగటూరులో ఈ నెలలో ఒకే రోజు ముగ్గురు చిన్నారులను కుక్కలు కరవడంతో మొదట చిన్నారుల తల్లితండ్రులు అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందకపోవడంతో నేరుగా కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించుకున్నారు. వైద్య సేవలకు ఏ పీహెచ్‌సీకి వెళ్లలన్నా కూడా వైద్యాధికారులు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి.

గ్రామాల్లో నిలిచిన వైద్య సేవలు

ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు అందుబాటులో ఉండాలి. కానీ ఎక్కడా కనబడని వైనం నెలకొంది. ఆశాలకు జీతాలు రాక ధర్నాలో ఉన్నారు. చిన్న పిల్లలకు కుక్కలు దాడి చేయడంతో ఎక్కడ టీకాలు లేకపోవడంతో వైద్యులు లేక కర్నూలుకు వెళ్లి టీకాలు వేయించుకున్నట్లు చిన్నారుల తల్లితండ్రులు తెలిపారు. వైద్యంపై ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో అధికం..



ప్రతి గ్రామంలో కుక్కల స్వైర విహారం అధికంగా ఉంది. చిన్న పిల్లలను, వృద్ధులను, యువకులను, వాహనదారులపై అధికంగా కుక్కల దాడులు జరుగుతున్నాయి. స్థానిక ఆస్పత్రుల్లో టీకాలు అందుబాటులో ఉంచాలి. వైద్యం కోసం కర్నూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– వెంకటేష్, ఉండవెల్లి

జాగ్రత్తలు అవసరం

ప్రతి గ్రామంలో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. వాటిని యానిమల్ కేర్ సెంటర్ వారు చర్యలు తీసుకోవాలని తెలిపాం. ప్రతి చోట కుక్క కాటుకు వ్యాక్సిన్ ఏర్పాటు చేస్తున్నాం. పిచ్చి కుక్కలకు మాత్రమే వ్యాక్సిన్ లేదు. చికిత్స కోసం గద్వాల్‌కు రావాలి. గద్వాల్ కంటే కర్నూలు దగ్గర కావడంతో వెళ్తుంటారు. వైద్యులను ప్రతి గ్రామంలో పంపించి వైద్య సేవలు అందిస్తాం.

– సిద్దప్ప, డీఎంహెచ్‌ఓ, జోగుళాంబ గద్వాల జిల్లా

సమస్యల్లో మల్దకల్ సంత



మల్దకల్‌లో రోడ్డుపై జరుగుతున్న సంత

మల్దకల్: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంత దినదినాభివృద్ధి చెందుతుండగా, సంతకు వచ్చే వ్యాపారులకు, ప్రజలకు కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంతోపాటు అయిజ, గద్వాల, ఇటిక్యాల, గట్టు తదితర మండలాల నుంచి వందలాదిగా ప్రజలు ప్రతి శనివారం సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. అంతేకాక గద్వాల జిల్లాలోనే ఎండు మిర్చికి ప్రసిద్ధిగాంచిన ఈ సంతకు జిల్లా నలు మూలల నుంచి కూడా పెద్ద ఎత్తున సంతకు రావడం సర్వసాధారణం. కానీ సంత నిర్వాహణ గ్రామంలోని రోడ్లపై నిర్వహిస్తుండడంతో వ్యాపారులు, ఇటు ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

అలంపూర్: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు. బుక్కాపురం చెందిన మద్దిలేటిరెడ్డికి రూ.36వేల చెక్కు ఇచ్చారు. శ్రీనివాస్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హర్‌ఘర్ తిరంగాలో భాగస్వాములు కావాలి

అలంపూర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగాలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే విజయుడు పిలుపునిచ్చారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యేకు తపాలా శాఖ తరపును మంగళవారం జాతీయ జెండాను అందజేశారు. నియోజకవర్గ ప్రజలందరూ తమ ఇంటి మీద జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలన్నారు. గద్వాల తపాలా శాఖ సహాయ పర్యవేక్షకుడు సైదా నాయక్, అలంపూర్ సబ్ పోస్టుమాస్టర్ రవిచంద్ర, ఉండవెల్లి సబ్ పోస్టుమాస్టర్ ఇమామ్ వలీ, పుల్లూరు ఏబీపీఎం జలీల్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమా ఓబులేష్

శాంతినగర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమా ఓబులేష్ నియమితులయ్యారు. సీసీఈ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్‌గా ఉత్తర్వులు రావడంతో మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమెను అధ్యాపకులు, సిబ్బంది శాలువలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యాపకులు సంపత్‌కుమార్, ఏడుకొండలు, జీవజయరాజు, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

ధరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలని బాలల హక్కుల పరి రక్షణ వేదిక కన్వీనర్ యుగంధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కేటీదొడ్డిలోని రైతువేదికలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక పత్తి, ఇతర వ్యవసాయ పనులకు వెళ్తున్నారని తెలిపారు. స్థానిక ఎంపీహెచ్‌ఎస్‌లో 394 మంది విద్యార్థులు ఉంటే కేవలం నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఇలాంటి పాఠశాలలు జిల్లాలో చాలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బడేసాబ్, వీరన్న, సవిత, సరోజ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ గత 27 ఏళ్ల నుంచి కులమతాలకతీతంగా ప్రజా సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ తన సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చదువుకు సంబంధించిన వస్తు సామాగ్రితోపాటు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహ్మద్ యాఖూబ్, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.



బాల్య వివాహాలు చేయడం నేరం



ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల అర్బన్: 18 ఏళ్లు నిండని అమ్మాయిలను వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సోషల్ మొబిలైజర్ విజ్ఞలత అన్నారు. ఆర్‌డీఎస్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బుర్దపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీసీపీసీ సమావేశం నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, ఆడపిల్లల చదువులు, సెల్‌ఫోన్ వల్ల వచ్చే అనార్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

బాలల సంరక్షణపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ, సీడీపీఓ సుజాత హాజరై బాలల చట్టాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాలలకు ఎదురయ్యే సమస్యలు, బడిబయటి పిల్లలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల యొక్క చట్టాలపై వివరించారు. ఏ సమయంలోనైనా టోల్‌ఫ్రీ నంబర్ 1098కి కాల్ చేసి సాయం పొందవచ్చునని తెలిపారు.



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న విజ్ఞలత



అలంపూర్‌లో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

అలంపూర్: సమాజంలోని బాలల సంరక్షణ అందరి బాధ్యత అని వీసీపీసీ మండల కమిటీ సభ్యులు ఏమేలమ్మ, శాంతమ్మ, నర్మద తెలిపారు. పట్టణంలోని గురుదేవ్ పాఠశాలలో బాలల సంరక్షణ సమావేశం మంగళవారం నిర్వహించారు. 14 నుంచి 18 ఏళ్ల వయస్సులో శరీరంలో కలిగే మార్పులను అధిగమించి చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు సమాజంలో విలువలు పెంచేలా ఎదగాలన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

మల్దకల్: బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని బాలల పరిరక్షణ సమితి జిల్లా కౌన్సెలర్ సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. మంగళవారం మండలంలోని మద్దెలబండలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అయిజ: బాలల పరిరక్షణ కమిటీని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారు బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద విద్యార్థులందరికీ ఉచిత విద్యను అందిస్తుందని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

శాంతినగర్: బడిఈడు పిల్లలందరూ బడికి రావాలని, ఎస్సెస్సీ అయిపోయాక ఉన్నత చదువులు చదవాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు.

వ్యాధిగ్రస్తులకు చికిత్స అవసరం



బొంకూరులో బాధితులకు చికిత్స చేస్తున్న వైద్య బృందం

ఉండవెల్లి: సెల్యూలైటిస్‌తో బాధపడుతున్న వారికి చికిత్స అవసరమని మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారి ప్రసూనరాణి తెలిపారు. మండలంలోని బొంకూరులో సెల్యూలైటీస్‌తో బాధపడుతున్న వారిని మంగళవారం 10 మంది పేర్లను నమోదు నమోదు చేసుకుని చికిత్స చేసి, వ్యాక్సిన్ వేశారు. మిగతా వారికి చికిత్స చేసి వ్యాధి నిర్ధారించేందుకు మందులను ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు యాకుబ్, మధు, చంద్రన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాన్‌దొడ్డిలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామస్తులకు హెపటైటిస్ బీ, సీ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మధుబాబు ఆధ్వర్యంలో గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రాజు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

శౌర్యయాత్రకు అందరూ తరలిరావాలి

అలంపూర్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలను విజయవంతం చేద్దామని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, కార్యదర్శి ఆశన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని హరిత టూరిజం అతిథి గృహంలో శౌర్య యాత్ర కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కళాకారులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతాంగ పోరాట వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి ఈ ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణంలో సెప్టెంబర్ 4వ తేదీన రాష్ట్ర కళాకారులతో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, విద్యావంతులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రలో మంగళవారం బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్క ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో భీమ్‌సేన్‌రావు, గోపాలకృష్ణ, నర్సింహయ్యశెట్టి, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగ అభియాన్‌లో భాగంగా మంగళవారం జాతీయ జెండాలతో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, రాజగోపాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బలరాంరెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్‌నాయుడు, రాఘవయ్య, జగన్, రమేష్, పరమేష్, హుస్సేన్ శివాజి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి



గుంతలు పడిన అయిజ-ఎక్లాస్‌పురం రోడ్డు

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఎక్లాస్‌పురం వైపు వెళ్లే రోడ్డు గుంతలు పడి చాలాకాలమైనా మరమ్మతు చేపట్టడం లేదు. వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా ఉండడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు దెబ్బతింటున్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మురుగు ఏర్పడి దుర్వాసన వస్తుంది. దోమలు అధికమవడంతో పాతబస్టాండ్ కాలనీ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విజయోత్సవాలకు తరలిన నాయకులు

గద్వాల అర్బన్: హైదరాబాద్‌లో మంగళవారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలకు జిల్లా కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రంజిత్, పరశురాం, వెంకటేష్, వంశీ తదితరులు ఉన్నారు.

మల్దకల్: విజయోత్సవ ర్యాలీకి మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. సుందర్ రాజు, చిన్న తిమ్మన్న, రాజేష్, తిప్పన్న, రాములు, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిద్దాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాల మల్లేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో.. జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యమాలలో అసువులు బాసిన అమరవీరులకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణకు కేంద్ర ప్రభుత్వమే ఆజ్యం పోస్తుందని మండిపడ్డారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం పేదరికం అలాగే కొనసాగుతున్నాయని వాపోయారు. మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని అన్నారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బాలకిషన్, కార్యవర్గ సభ్యులు పి.సురేష్, కొండపల్లి రాము, అల్వాల్ రెడ్డి, గోవర్ధన్, ఎస్.శంకర్ నాయక్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.